# స్కెచ్

# అక్కినేని నాగేశ్వరరావు


4 లో ప్రతిభావారి ఘంటసాల బలరామయ్యగారు "సీతారామ జననం" తీయ సంకల్పించి, దశరథుని ...త్రకు డి. వి. సుబ్బారావుగారిని మాట్లాడవామని మద్రాసు ...ంచి తమ కామెరామాన్ శ్రీధర్‌తో బయల్దేరి, బెజవాడలో ...గి బందరు బండి ఎక్కారు. ఆ బండిలోనే మరికొందరు యువకులుకూడా ఎక్కారు. వీరిని వారూ, వారిని వీరూ చూసుకున్నారుగాని ఒకరినిగురించి ఒకరెరగరు. వీరిమధ్య పరస్పరపరిచయం లేకుండానే బండి గుడివాడ వచ్చింది. యువకులు గుడివాడలో దిగిపోయారు. అక్కడ బండి చాలాసేపాగుతుంది గనక బలరామయ్యగారుకూడా ప్లాట్ ఫారంమీదికి దిగారు. ఈ యువకులవెంట వున్న హార్మోనియం, తబలాలు వగైరా చూడగానే బలరామయ్యగారికి వీళ్లేవో నాటకంవాళ్లని తెలిసిపోయి ఉండాలి. విచారించగా వీళ్లు ఎక్సెల్సియర్ డ్రమెటిక్ కంపెనీ, ముదినేపల్లివారనీ, అందులో తనను ఆకర్షించిన ఒక యువకుడు ఈ కంపెనీలో హీరోయిన్ పాత్రలు విజయవంతంగా ధరిస్తూవుంటాడనీ ఆయనకు తెలిసింది.

ఈ వివరాలు మనసులో ఉంచుకుని బలరామయ్యగారు బందరువెళ్లి, బందరునుండి తిరిగివచ్చేదారిలో గుడివాడలో దిగి, గోపాలరావు, మంగయ్యలద్వారా ఎక్సెల్సియర్‌వారి "హీరోయిన్"ను కలుసుకుని—సినిమా మేకప్‌కు ప్రసిద్ధికెక్కిన ఈ ఇద్దరూ అప్పట్లో ఈ "హీరోయిన్"కు స్పెషల్ మేకప్ చేసేవారు—అతన్ని తమ చిత్రంలో రామలక్ష్మణుల పాత్రలలో ఒకదానికి బుక్‌చేశారు. రెండో కుర్రవాడు ఇతనికన్న చిన్నవాడే దొరుకుతాడో, పెద్దవాడే దొరుకుతాడో తెలియక ఈపనిచెయ్యవలిసి వచ్చింది.

"హీరోయిన్" నాగేశ్వర్రావు సినిమాలలో ప్రవేశించి "హీరో నాగేశ్వర్రావు" కావటం ఈ విధంగా జరిగింది.

ఇవాళ నాగేశ్వర్రావు మనకున్న కొద్దిమంది రొమాంటిక్ హీరోలలో ఒకడు. ఇతని జీవితం చిత్రమైంది. ఇతని స్వగ్రామం గుడివాడ తాలూకాలోని వెంకటరాఘవాపురం. ఇతను 1924 సెప్టెంబరు 20 న పుట్టాడు. వీరిది మధ్యతరగతి రైతుకుటుంబం. వీరు అయిదుగురు అన్నదమ్ములు. నాగేశ్వర్రావు ఆఖరివాడు. అప్పచెల్లెళ్ళు లేరు. పాతిక ఎకరాల భూవసతి ఉందంటే దాన్ని పంచుకోగా ఇతనికి అయిదెకరాలు వచ్చింది. చదువుచూడబోతే మూడో ఫారం పూర్తిచెయ్యలేదు. ఉద్యోగాలుచేసి ఊళ్ళేలే అవకాశాలు లేవు. పొలంచేసుకుంటూ పొట్టపోసుకుంటే ఐక్క రైతు జీవితం గడపవలసినవాడు. అటువంటివాడు సినిమా రంగంలోప్రవేశించి,అంతసుపూర్వంసినిమాలలోప్రసిద్ధులుగా ఉన్నవారినందరినీ అవలీలగా దాటి తారాపథానికి దూసుకు

"బాలరాజు" లో





"స్త్రీసాహసం"లో

పోయి, ఇప్పటికి 30 చిత్రాలలో నటించి ప్రథమశ్రేణి సినిమా నటుడుగా ఉన్నాడంటే నిజంగా ఆశ్చర్యమే. కాని ఇదంతా ఒక్కత్రుటిలో జరిగిన కనుకట్టుకాదు. దీనివెనక నాగేశ్వరరావు కృషి బోలెడంత ఉంది.

నాగేశ్వరరావు స్వగ్రామంలో ఎలిమెంటరీస్కూలుపైన చదువులేదు. అందుచేత రోజూ రెండుమైళ్ళు నడిచి పెదవిరివాడకువెళ్ళి అక్కడ చదువుకుంటూ ఉండేవాడు. ఈ రోజుల్లోనే ఇతను వాళ్ళ స్వగ్రామంలో కొందరు కుర్రవాళ్లతో చేరి పిల్లలనాటకాలాడి స్థానికఖ్యాతి సంపాదించాడు. ఈ నాటకాలలో ఇతను మొదటిసారి "సావిత్రి"లో నారదుడు, తరువాత "హరిశ్చంద్ర"లో చంద్రమతీ వేశాడు.


నాగేశ్వరరావు పెద్దన్నగారు రామబ్రహ్మంగారికి నాటకాల సరదా జాస్తి. అయనకు నాగేశ్వరరావు నటుడవుతాడన్న నమ్మకంకూడా ఉండేది. కుదరవల్లిగ్రామంలో కొందరు చేరి చందాలువేసుకుని నాటకాలాడుతూండేవారు. నెలకు రెండురూపాయలిచ్చి రామబ్రహ్మంగారు నాగేశ్వరరావును ఈ సమాజంలో సభ్యుడుగాచేశారు. అప్పటికి నాగేశ్వరరావు మూడోఫారం చదువుతూండేవాడు. ఈ చదు... కావనీ, చదివించి ప్రయోజనమూ ఉండదనీ... పైకివస్తే లాభిస్తుందనీ రామబ్రహ్మంగారి అ... రోజుల్లో నాగేశ్వరరావు గ్రామంలో కొందరు కుర్రా... అధ్యాపకుణ్ణి తెచ్చారు. నాగేశ్వరరావు హిం... కూడా చదివి ఆరుమాసాల అనంతరం మాధ్యమి... పాసయినాడు.

ఈ రోజులు నాగేశ్వరరావుకు చాలా కష్టంగా ఉ... అతని పెద్దన్నగార్లు ముగ్గురు విభాగాలుపడి వేరేకాపు... చేస్తూండేవారు. తల్లి వృద్ధురాలు; చిన్నకొడుకులవ... ఉండేది. ఆమెకు వంట్లో సరిగాలేకపోతే నాగేశ్వరరా... తొమ్మిదిన్నరకల్లా వంటచేసి భోంచేసి, రెండుమైళ్ళు నడిచి స్కూలుకువెళ్లి, అయిదున్నరకు తిరిగివచ్చి, హిందీక్లాసు ముగించి, కుదరవల్లికిపోయి నాటకాలరిహార్సల్స్ చేయవలసి ఉండేది.

ఇదంతా భరించి నాగేశ్వరరావు ఈ నాటకసమాజంలో "కనకతార"లో తారపాత్రా, "కృష్ణలీల"లో కృష్ణుడి పాత్రా ధరించి జయప్రదంగా నటించాడు. దీనిఫలితంగా నాగేశ్వరరావు మిత్రుల ప్రోద్బలంమీద మొఖాసా కలవపూడిలోనూ, అంగలూరులోనూ ఇతరులతో కలిసి "కనకతార"లో తారపాత్ర ధరించటంకూడా జరిగింది.

పరిస్థితులు బాగాలేక నాగేశ్వరరావు చదువు చాలించాడు. అన్నగారు రామబ్రహ్మంగారు అతన్ని ఎట్లాగైనా సినిమాలలో ఇరికించాలనే తలంపుతో కాజ వెంకట్రామయ్యగారి ద్వారా డైరెక్టర్ పి. పుల్లయ్యకు పరిచయం చేయించి "ధర్మపత్ని"కి పంపారు. కాని నాగేశ్వరరావు కదొక సినిమా అనుభవంకింద కలిసిరాలేదు. రామబ్రహ్మంగారికికూడా స్టేజిమీదనే గురి కుదిరినట్టు కనబడుతుంది. ఆయన

"బ్రతుకుతెరువు"లో




ఎదట నిలబడగానే వొళ్ళంతా వణికిందిట. ఆ వణుకు ఆపుకోవటానికి గట్టిగా గిల్లుకోవలిసివచ్చిందిట. ఎట్లాగో సంభాషణ చెప్పాడు — అంతా బాగుందన్నారు! వేషం రాముడివేషం. చూడటానికి అమ్మాయిలాగుండేవాడు. అసలే స్టేజి అలవాటుచొప్పన నడకా, గొంతూ అమ్మాయిలాగుండేవి. వేషంకూడా అదే ధోరణిలో తయారయింది. అర్భకుడు, అవయవసౌష్టవంలేదు. అందుచేత ఆర్టు డైరెక్టరుగారు దుస్తులకు పాడింగ్‌పెట్టి మఖ్మల్‌గుడ్డతో తయారుచేస్తే ఫలితం ఇదీ!

ఈదశలో నాగేశ్వరరావుకు ఏమాత్రమూ ఆత్మవిశ్వాసం ఉండేదికాదు. ప్రతిదీ ఎదురే. మగవేషాలువేయటం తనకు అలవాటులేదు. మగపాత్రలకు సంభాషణలు ఎట్లాచెప్పాలో, ఎవరన్నా అనిచూపిస్తేతప్ప తానుగా సంభాషణ అనటానికి జంకు. ఆడపాత్రలకు పాడటమంటే ఒకటో శ్రుతి తార స్థాయిలో పాడేవాడు స్టేజిమీద. ఇప్పుడు మధ్యమస్థాయి దాటకుండా పాడవలిసొచ్చింది. దానికోసం రోజూ ఖరజ్ పట్టటం. ఎంతచేసినా సీతారామ జననంలో పాటకు గొంతు వణికింది. (ఇట్లావుండికూడా నాగేశ్వరరావు "సీతారామ జననం," "మాయలోకం," "ముగ్గురు మరాఠీలు," "పల్నాటియుద్ధం" చిత్రాలలో తానే పాడాడు. "బాలరాజు" లోకూడా ఒక డ్యూయెట్‌పాడి సోలో పాడవలిసివచ్చేసరికి గొంతు సరిలేక ప్లేబాక్ అర్థించటం జరిగింది. అటుపైన సినిమాలలో సొంతాన పాడటంలేదు.)

"సీతారామ జననం" జరుగుతున్న సమయంలో "మాయలోకం" తీసేయత్నంలో ఉన్న గూడవల్లి రామబ్రహ్మంగారు ప్రతిభా లాడ్జికి వచ్చారు. ఆయనకు హీరో కావలిసివుంది. బలరామయ్యగారు నాగేశ్వరరావును పిలిపించారు. నాగేశ్వరరావు వచ్చి రామబ్రహ్మంగారి ఎదట ఠీగ్గా నిలబడ్డాడు, నమస్కారమన్నా చెయ్యలేదు. (అటువంటి ఆచారాలు అతని కప్పటికింకా అలవాటులేదు.) నాగేశ్వరరావును చొక్కా విప్పదీయించి చూసి రామబ్రహ్మంగారు, తనచిత్రంలో నటించబోయే శాంతకుమారి, రాజమ్మల మధ్య అర్భకుడుగా కనిపిస్తాడని చెప్పారు. అతన్ని తీసుకునే ఆలోచన అప్పటికి అక్కడితో అంతమయింది. రామబ్రహ్మంగారు ఇతర హీరోలను చూశారు కూడానూ.

అయితే "మాయలోకం"లో నాగేశ్వరరావుచేత హీరో వేయించమనీ, అతను చాలా సమర్థుడైన నటుడనీ చల్లపల్లి రాజాగారూ, మధుసూదనరావుగారూ రామబ్రహ్మంగారికి నచ్చచెప్పారు. రామబ్రహ్మంగారు నాగేశ్వరరావుకూడా మేకప్ టెస్ట్ తీశారు. అనంతరం శరాబందిరాజు వేషానికి



"రక్షరేఖ"లో

అతన్ని బుక్‌చేశారుకూడా. అయితే ఒకసెట్టుమీద పనిఅయి రషెస్‌చూసేదాకా రామబ్రహ్మంగారికి నాగేశ్వరరావులో అంతగా విశ్వాసంలేదు. ఆపైన ఆయనకు అతనిమీద అంతులేని ఆదరం పుట్టుకొచ్చింది. అతన్ని హొటల్లో మానిపించి తన ఇంటోనే పెట్టుకున్నారు. అతనికి నటన నేర్పమని డాక్టరు సుబ్బారావుగారికి చెప్పారు. అతన్ని పెంచుకుంటానని, మిత్రులతో ఆయన అంటూండేవారు.

"సీతారామ జననం"లో అతను సాధించిన విజయమేమీలేదు. "మాయలోకం"లో అతను సాధించిన విజయం సినిమారంగంలో కాలు నిలవదొక్కుకోవటానికి పనికి వచ్చింది. ఎందుకంటే ఈ చిత్రంలో అతనిచుట్టూ డాక్టరు సుబ్బారావు, సి. ఎస్. ఆర్., శాంతకుమారి మొదలైన ఆరితేరిన నటులున్నారు. వీరిమధ్య నిలబడలేక పోయినట్టయితే నాగేశ్వరరావు సినిమాలలో ఎక్కివచ్చేవాడు కాడు.

"మాయలోకం" షూటింగు జరుగుతూండగా బలరా

"వుయ్ టూ"లో





"దేవదాస్"లో

మయ్యగారు "ముగ్గురు మరాఠీలు" అరంభించి, అందులోకి నాగేశ్వరరావుని బుక్‌చేశారు. ఈ చిత్రంతో నాగేశ్వరరావు "ఫోక్‌లోర్ హీరో" అన్నమాటకు ప్రాతిపదిక ఏర్పడింది. ఈ చిత్రం తరువాత రామబ్రహ్మంగారి "పల్నాటి యుద్ధం" ప్రారంభం కావటమూ, ఒకసెట్టుమాత్రమే పూర్తిచేసి ఆయన మరణించటమూ జరిగింది. రామబ్రహ్మంగారికి తాను చాలా రుణపడ్డాననీ, ఆరుణం తీర్చుకునే అవకాశం తనకు లేకపోయిందనీ నాగేశ్వరరావు భావిస్తాడు.

"పల్నాటి యుద్ధం" పూర్తి అయి విడుదల అయినాక నాగేశ్వరరావుకు తన సినిమానటనలో విశ్వాసం కుదిరింది. దాని అనంతరం వచ్చిన ప్రతిభావారి "బాలరాజు" చిత్రం యొక్క విజయం అతనికీర్తిని బాగా ప్రచారంచేసింది. "లైలామజ్నూ"లో ఖయస్‌పాత్ర ధరించటానికి ఒప్పుకున్నప్పుడు అందరూ అతన్ని నిరుత్సాహపరిచారు. కాని ఆ చిత్రంకూడా అతనికి మంచి ప్రచారం ఇచ్చింది. తాను జానపద చిత్రాలకుతప్ప పనికిరాడన్నది అబద్ధమని రుజువు చెయ్యటానికి చిన్న మొత్తానికి నాగేశ్వరరావు "సంసారం"లో బుక్ అయినాడు. ఆచిత్రంలో తన పాత్ర అంతగా ప్రజామోదం పొందటానికి డైరెక్టరు ప్రసాద్‌గారు ప్రధాన కారకులంటాడు నాగేశ్వరరావు. అది హీరోపాత్రకాదు కాని మంచి పాత్ర. హీరోలుతప్ప వెయ్యనన్న నియమం అతనికిలేదు. "పల్లెటూరిపిల్ల"లో కూడా అతనువేసినపాత్రహీరోపాత్రకాదు.

సినిమారంగంలోగల ఇంతమంది వ్యక్తులలోనూ ఘంటసాల బలరామయ్యగారితో నాగేశ్వరరావుకుగల సంబంధం అతి చిత్రమైనది. ఆయన సమక్షంలో అతనికి ఏవిధమైన వ్యక్తిత్వమూలేదు. ప్రపంచంలో ఇంకెవరిని చూసినా లేని భయభక్తులు ఆయనంటే నాగేశ్వరరావు కున్నాయి. "ఇదేమిటి?" అని అతను ఆయన్ను అడగడు, అడగలేదు. బలరామయ్యగారికి నాగేశ్వరరావంటే విపరీతమైన అభిమానం. ఇప్పటి కతను బలరామయ్యగారికి అయిదు చిత్రాలలో పనిచేశాడు.

1950, 51 సంవత్సరాలలో నాగేశ్వరరావు చాలా పిక్చర్లలో బుక్ అయినాడు. దీనికి కొన్ని కారణాలున్నాయి: అడిగినవారిమాట తీసెయ్యలేకపోవటం ఒకటీ, చాలా పిక్చర్లలో బుక్‌అయిన గ్లామర్‌కోసమూ, చాలాడబ్బు చేసుకోవాలన్న తృష్ణా. ఇందువల్ల తనకు అన్నివిధాలా నష్టమేకలిగిందని అతను చెబుతాడు. పాత్రలా మంచివికావు. ఇన్నిచిత్రాలలో పనిచేసి ఆరోగ్యం పాడుచేసుకున్నాడు. ఈ చిత్రాలలో చాలాభాగం దెబ్బతినటంమూలాన అతనికి చాలా నిరుత్సాహం కలిగింది. మంచి గుణపాఠం నేర్చుకున్నాడు. చిత్రాలు తగ్గించుకొని ఆరోగ్యం, గ్లామరూ కాపాడుకోమని శ్రీ బి. యన్. రెడ్డిగారు అనేకసార్లు అతనికి సలహాయిచ్చారు. తన శ్రేయస్సుకోరే శ్రీ బి. యన్. రెడ్డిగారి సలహాను నాగేశ్వరరావు పాటిస్తున్నాడు. ఇకముందు మంచి పాత్రలుంటేనే బుక్ కావాలనీ, ఎట్టి పరిస్థితులలోనూ రోజుకు ఒక కాల్‌షీట్‌పైన పని చెయ్యకూడదని అతని నిర్ణయం. ముఖ్యంగా అతనికి కావలిసింది ప్రేక్షకులు తన పాత్రలనుచూచి ఆనందించటం. తనమూలంగా ప్రొడ్యూసర్లు ఇబ్బంది పడకూడదన్నదికూడా అతనికి ముఖ్యమే. అతనింతవరకు ఏ ప్రొడ్యూసరుచేతా బాధపెడతాడన్నమాట పడలేదు. ఇకముందుకూడా అట్లాగే జరుపుకోవాలని అతని పట్టుదల.

నాగేశ్వరరావు ఏ చిత్రంలో పనిచేస్తున్నా అందులో తాను భాగస్వామి అయినట్టే శ్రద్ధతీసుకుంటాడు. అందుచేతనే అతను ప్రతిభా, భరణీ, వినోదా, అంజలీ వగైరా సంస్థలన్నిటిలోనూ అవి తన స్వంత సంస్థలైనట్టే సంచరిస్తాడు. నిజంగా అతను భాగస్వామిగా పనిచేసినసంస్థ అశ్వనీపిక్చర్స్ ఒకటే.

అందులో అతనితోబాటు అంజలీదేవీ, ఆదినారాయణ రావూ, గోపాలరావూ భాగస్తులు. వీరుతీసిన "మాయల మారి" బాగానడిచింది.

సంవత్సరం క్రితం అతని ఆప్తులైన మధుసూదనరావు గారూ, మరికొందరూచేరి "అన్నపూర్ణాపిక్చర్స్" స్థాపించారు. దానికి మధుసూదనరావుగారు మేనేజింగ్ డైరెక్టర్. నాగేశ్వరరావు బోర్డాఫ్‌డైరెక్టర్స్‌కు అధ్యక్షుడు. వీరు 1953లో చిత్రంతీస్తారు. దీన్ని కె. వి. రెడ్డిగారు డైరెక్టుచేస్తారు. కథా అదీ తయారవుతోంది.

కె. వి. రెడ్డి, బి. ఎస్. రెడ్డి, హెచ్. ఎం. రెడ్డి వంటి డైరెక్టర్లక్రింద తా నింతవరకు పనిచేయలేదన్న అసంతృప్తి నాగేశ్వరరావుకుంది. ప్రతి ప్రతిభావంతుడైన డైరెక్టరు ఆర్టిస్టులో కొత్తశక్తులు కొన్నిటిని బయటికి తీసుకొస్తాడని నాగేశ్వరరావు నమ్మకం. ఇది యథార్థంకూడానూ. ఇతని కోరిక ఇకముందు కొనసాగుతుందని ఆశించవచ్చు.

పాత్రలో లీనమైపోవటమన్నది మంచి నటన అని నాగేశ్వరరావు ఒప్పుకోడు. షాట్స్‌మధ్య "మూడ్"లో ఉండటం కూడా అతనికి నచ్చదు. ఎవరైనా అట్లా ఉండటానికి ప్రయత్నిస్తే తాను పక్కనఉన్నప్పుడు వాళ్ళ "మూడ్" చెడగొడతాడుకూడానూ. నటుడు ఎలెక్ట్రిక్ బల్బ్‌లాగా స్విచ్‌వెయ్యగానే వెలగాలని అతని నమ్మకం. నటనలో సౌలభ్యం ఉండాలంటా డతను. వళ్ళు విరుచుకోవటం అతనికి గిట్టదు. అందుకే హిందీనటుడు దిలీప్‌కుమార్‌ను అతను ప్రశంసిస్తాడు. పాత్ర కనపడకుండా నటనలో నటుడే కనిపించడంకూడా అతను ఒప్పుకోడు. మంచి నటుడు చచ్చునటుల ప్రక్కన రాణిస్తాడన్న సిద్ధాంతాన్ని నాగేశ్వరరావు తీవ్రంగా ఖండిస్తాడు. మంచినటు లెప్పుడూ మంచినటుల పక్కనే రాణిస్తారని అతని దృఢవిశ్వాసం.

ఈనాడు చాలా చిత్రాలు అపజయంపొందటానికి కారణా లేవంటే అతను ముఖ్యంగా కథలో బలంలేకపోవటమూ, ఒకవేళ వున్నా దానిని తెరపై సరిగా చిత్రించకపోవటమూ అంటాడు. ఈనాడు ప్రేక్షకులు కేవలం వ్యక్తులపేర్లు చూచి ఎగబడే స్థితిలోలేరనీ, చిత్రం అన్నివిధాలా జనరంజకంగా వుంటేనే వాళ్లను అకర్షిస్తుందనీ నాగేశ్వరరావు విశ్వాసం.

నాగేశ్వరరావు స్వతహాగా ఆడంబరంలేనివాడు. అతని మనస్తత్వంలోగాని, ప్రవర్తనలోగాని భేషజం, పటాటోపం, పై మెరుగులూ, తళుకుమనే ధోరణీ లేవు. అతను ప్రపంచాన్నీ, తన పరిసరాలనూ వాస్తవిక దృష్టితోచూస్తాడు. అతను కలలు కనడు. ఎన్నడూ ఊహాసౌధాలు నిర్మించే వ్యక్తిలాగా కనబడడు. ఒక్క స్కారాలు పెట్టటంవిషయంలోనే కాదు, ఏవిషయంలోనూ అతనికి కపటం, కృత్రిమత్వం పనికిరావు. మద్రాసు నగరంలోవుండి, అతి కృత్రిమమైన సినిమా ప్రపంచంలోవుంటూ ఈ "నాగరికత"తో ఘర్షణపడటం సాధ్యంకాదు. అయినా నాగేశ్వరరావు దానిపై తనకుగలద్వేషాన్ని కప్పిపుచ్చటం నేర్చుకున్నాడేగాని దానితో రాజీమాత్రం పడలేదు, పడడుకూడానూ.

నటుడుగాకూడా ఏనాటికైనా సహజత్వంలోనే అతను రాణించగలడు. అతను సాంఘిక చిత్రాల్లో వేషాలు వేయటానికి పుట్టివుంటి జానపదచిత్రాల్లో పైకిరావటం చిత్రం. అసంఖ్యాకులైన తెలుగు సినిమాప్రేక్షకులు అతన్ని "సంసారం"లో చూసి ముచ్చటపడటాని కదేకారణం. తెలుగు గడ్డకు వెన్నెముక అయిన రైతుకుండే మనోదార్ఢ్యమూ, వాస్తవికదృష్టి నాగేశ్వరరావులో బలంగా వున్నాయి. అందుకే అతను సినిమాలలోకి వస్తూనే జనాన్ని

"సంసారం"లో



బలం
గా ఆకర్షించగలిగాడు. దీనికితోడు అతనిలో ఇంకొక అకర్షణకూడావుంది. అదేమిటంటే మూర్తీభవించిన యువకత్వం. ప్రతియువకుడూ, విద్యార్థీకూడా తడువుకోకుండా నాగేశ్వరరావును తమ ప్రతినిధిగా ఎన్నుకుంటారు. ఈ విషయంలో నాగేశ్వరరావుతో పోటీచెయ్యగల వారెవ్వరూ తెలుగు సినిమారంగంలో లేరు.

నాగేశ్వరరావులో మామూలు పొరుడి లక్షణం ఇంకొకటి కూడావుంది. అలిఖిత సాంఘిక నియమాలను అతను ఎన్నడూ తృణీకారభావంతో చూడడు. ఎవరో తనను శాసిస్తున్నట్టుగా వాటన్నిటినీ అతను మనస్ఫూర్తిగా పాలిస్తాడు. అతనికేమీ వ్యసనాలులేవు. సినిమారంగంలోకి వచ్చి కాస్త పేరుచేసుకుని నాలుగురాళ్ళు సంపాదించిన మరుక్షణంనుంచీ కొందరు అమలుజరిపే "స్వేచ్ఛలు" అతనికి అవసరం ఉన్నట్టుకూడా కనపడదు.

సెప్టెంబరుమాసంలో పుట్టినవారు జీవితంలో సాధారణంగా విజయం సంపాదిస్తారనీ, తెలివితేటలు చురుకుగా ఉంటాయనీ, అడ్డమైనవారందరినీ చేరదీయరనీ, తమ అనుభవంమీదే అధికంగా ఆధారపడి ప్రతిదీ విమర్శిస్తారనీ, తమ సరిసరాలలో సంఘర్షణ సహించలేరనీ, మనోహర వస్తుప్రియులనీ, దాదాపు ఏవృత్తిలోకి దిగినా విజయం సాధించందీ వదలరనీ, యువకదశలో సెక్సువిషయాలలో పవిత్రంగా, పట్టుదలగా వుంటారనీ చెబుతారు. ఈ లక్షణాలన్నీ నాగేశ్వరరావులో సమృద్ధిగా కనిపిస్తాయి.

ప్రస్తుతం సినిమాపరిశ్రమ పరిణామదశలో వున్నది. ముందు ముందు తీయబోయే చిత్రాలలో వాస్తవికతకు మంచిస్థానం ఉండేలాగు కనిపిస్తుంది. ఇటువంటిమార్పె వస్తే నాగేశ్వరరావులో మనం కొత్తపోకడలూ, కొత్తశక్తులూ తప్పక చూడగలుగుతాము.

శోభనాచలవారి "ప్రజాసేవ"లో కాశ్యప, గిరిజ

